క్లుప్తంగా

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం


సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి వారి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం కావడంతో మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో గురువారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన శ్రీ రాధాకృష్ణ భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత


విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. మండలంలో గవరవరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యను అభ్యసించడం ద్వారా తమ జీవితంలో బంగారు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్ఆర్ఆర్ నరసింహారాజు, చుక్కల శోభన్‌బాబు, ప్రధానోపాధ్యాయులు ఎం.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొంగిన మెట్టగూడెం వాగు


మెట్టగూడెం సమీపంలో వాగు పొంగుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మెట్టగూడెం, మర్రిగూడెం గ్రామాల మధ్యలో ఉన్న వాగు గురువారం ఉధృతంగా పొంగింది. అడపాదడపా వర్షాలు ఎగువన కురుస్తుండడంతో వాగు ఉధృతంగా పొంగుతూనే ఉంది. దీంతో రెండు గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెట్టగూడెం, ముప్పినవారిగూడెం, అంకంపాలెం గ్రామాల రైతులు మర్రిగూడెం వైపే వ్యవసాయం చేయడంతో వాగు దాటి వెళ్లి పనులు చేస్తున్నారు.

పారితోషికం ఇప్పించండి

బుట్టాయగూడెం: ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గంలో విధులు నిర్వహించిన తమకు ఇంత వరకూ పారితోషికం అందలేదని ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు నెలలు పూర్తి కావొస్తున్నా తమకు ఇవ్వాల్సిన పారితోషకం విషయంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎన్నిసార్లు తమ గోడు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందికి మాత్రమే ఇచ్చారని, ఇప్పటికైనా అధికారులు తమకు రావాల్సిన పారితోషకాన్ని ఇప్పించే విధంగా కృషి చేయాలని బి.ప్రదీప్ కోరారు.

సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

టి.నరసాపురం: సీసీఆర్‌సీ కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి బి.సుమలత తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని 3495 మంది కౌలు రైతులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 1500 మంది మాత్రమే సీసీఆర్‌సీ కార్డులు పొందారన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా అందే పలు పథకాలు, బీమా తదతర సౌకర్యాలకు అర్హత లభిస్తుందన్నారు. కావున ఎవరైతే ఇంకా సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోలేదో, వారందరూ వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఎంపిక చేయబడిన రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తామని, రైతులు సహకరించాలన్నారు. మండలంలో 810 మట్టి నమూనాల సేకరణకు గాను ఇప్పటి వరకు 600 నమూనాలు సేకరించినట్లు ఏవో తెలిపారు.

వర్జీనియా రైతు సంఘం హర్షం

జంగారెడ్డిగూడెం: అపరాధ రుసుము లేకుండా అదనపు పంటను విక్రయానికి అనుమతులు రావడంపై వర్జీనియా రైతులు హర్షం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ములగలంపల్లి మాజీ సొసైటీ అధ్యక్షులు, వర్జీనియా రైతు సంఘ నాయకులు ఘంటశాల గాంధీ మాట్లాడుతూ నిర్దేశించిన కోటాను మించి పండిన పంటకు అపరాధ రుసుం లేకుండా అమ్ముకునేందుకు ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

భయం నీడన గిరిజన బతుకులు


కన్నారప్పాడు సమీపంలోని కొవ్వాడ వాగు పొంగడంతో ఒడ్డున నిలబడిన గిరిజనులు (ఫైల్)


ఇప్పలపాడు సమీపంలో పొంగిన జల్లేరు వాగు (ఫైల్)


జల్లేరు వాగు దాటుతున్న కూలీలు (ఫైల్)

- వర్షాకాలంలో పొంగుతున్న కొండ కాలువలు, వాగులు
- బ్రిడ్జిల నిర్మాణం లేక ఆదివాసీల అవస్థలు
- సమస్యలు పట్టించుకోని పాలకులు

బుట్టాయగూడెం: వర్షాకాలం వచ్చిందంటే ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు భయం నీడలో బతుకుతుంటారు. ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా కురుస్తుంటాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా కొండ వాగులు ఉధృతంగా పొంగుతుంటాయి. ఎక్కువ శాతం గ్రామాలకు వెళ్లే రహదారులకు వాగులపై బ్రిడ్జిల నిర్మాణాలు లేకపోవడంతో వర్షాకాలంలో గిరిజనులు ప్రయాణ బాధలు వర్ణనాతీతంగా మారతాయి. వాగులను దాటే ప్రయత్నంలో అనేక మంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో ఎక్కువగా బుట్టాయగూడెం మండలంలోని రెడ్డి కోపల్లి సమీపంలోని కాలువ, కన్నారప్పాడు కాలువ, ముంజులూరు సమీపంలోని జారుడు కాలువ, అలాగే రెడ్డి బొడ్డేరు సమీపంలోని జల్లేరు, వీరన్నపాలెం సమీపంలోని జల్లేరు వాగుతో పాటు అనేక కొండ వాగులు పొంగుతూ ఉంటాయి. గతంలో పట్టినపాలెం సమీపంలోని వాగు, ఇప్పలపాడు సమీపంలోని వాగు ప్రవాహంలో గతంలో దాదాపు 24 మందికి పైగా కొట్టుకుపోయి మృతి చెందారు. అదేవిధంగా గోగుమిల్లికి చెందిన లింగారెడ్డి అనే గిరిజన యువకుడు ముంజులూరు సమీపంలోని కాలువలో కొట్టుకుపోయి మృతి చెందాడు. అయితే కొండ కాలువల ప్రవాహానికి గిరిజనులు మృతులను నివారించాలనే ఉద్దేశ్యంతో మహానేత రాజశేఖరరెడ్డి రౌతుగూడెం, పడమర రేగులకుంట, గాడిదబోరు, బైనేరువాగుపై సుమారు 26 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించారు. దీంతో బయటి ప్రాంతంలోని ప్రజలకు వాగుల ప్రవాహ కష్టాలు తప్పాయి. అయితే కొండ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో మాత్రం వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు లేకపోవడం వలన సుమారు 4 నెలలు గిరిజనుల బాధలు వర్ణనాతీతంగా మారతాయి. వర్షాకాలంలో వాగుల ప్రవాహం వలన గిరిజనులకు బయట గ్రామాలతో సంబంధాలు కూడా తెగిపోతూ ఉంటాయి. దాదాపు ఏజెన్సీ ప్రాంతంలోని వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో 60 గ్రామాలకు పైగా వాగుల వలన బాధలు పడుతున్న గిరిజనులు ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ మరికొద్ది రోజుల్లో వర్షాలు అధికంగా పడే అవకాశం ఉన్నందున కొండవాగుల ప్రవాహాలపై గిరిజనులు తీవ్రమైన భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గిరిజన ప్రాంతంలోని కొండ వాగులపై బ్రిడ్జి నిర్మాణాలకు కృషి చేసి, గిరిజనులను వాగుల కష్టాల నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

లింగగూడెం భూములపై విచారణ


నాయకపోడు గిరిజనులను విచారిస్తున్న అధికారులు

చింతలపూడి: చింతలపూడి మండలం, లింగగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో 107 ఎకరాల గయాళు భూములను నాయకపోడులకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ గురువారం డిమాండ్ చేశారు. 1990 నుంచి రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల నాయకపోడు గిరిజనులు భూపోరాటాల ద్వారా ఆ భూములను సాధించుకున్నారన్నారు. అప్పటి నుంచి నాయకపోడు గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల కొంత మంది పెత్తందారులు నాయకపోడులను ప్రలోభ పెట్టి భూములను కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయగా చింతలపూడి తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారని చెప్పారు. బుధవారం వీఆర్‌వో గ్రామంలో బహిరంగ విచారణ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం గిరిజనులకు భూములపై సర్వ హక్కులు కల్పించి వ్యవసాయ బోర్లు వేసి అభివృద్ధి చేయాలని కోరారు.

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి


మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: గృహ హింస చట్టం, దాని వలన కలిగే రక్షణ గురించి మహిళలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారిత, బేటి బచావో-బేటి పఢావో 100 డేస్ ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి గృహ హింస చట్టం, దాని ద్వారా కల్పించే రక్షణ, న్యాయస్థానం విచారణ విధానం, అప్పీల్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జీఎంఎస్‌కే సుజనా మాట్లాడుతూ ఏ దేశంలో అయితే స్త్రీ ఆర్థిక, రాజకీయ సామాజిక స్వావలంబన కలిగి ఉంటుందో ఆ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. 2015 లో ప్రారంభించబడిన బేటి బచావో.. బేటి పఢావో పథకం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో, వారి పూర్తి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారన్నారు. లింగ పక్షపాతం తగ్గించడం, ఆడ పిల్లలకు మనుగడ, రక్షణ కల్పించడం, బాలికలకు చదువు అందేటట్లు చూడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు


వైద్యం పొందుతున్న వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుంటున్న డీఎంవో ప్రసాద్

బుట్టాయగూడెం: ఏజెన్సీలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామమైన పులిరామన్నగూడెంలో నిర్వహిస్తున్న రెండో విడత మలాథియాన్ స్ప్రేయింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో సమస్యాత్మక గ్రామాల్లో రెండో విడత స్ప్రేయింగ్ పనులు ప్రారంభించామన్నారు. వాతావరణంలో మార్పుల వలన ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో జ్వరాలు అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అదే విధంగా దోమతెరలను తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం పీఆర్‌గూడెం పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్ గూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాగ్యశ్రీ, సబ్ యూనిట్ ఆఫీసర్ పెద్దిరాజు, పీహెచ్ఎన్ నాగపున్నారి, రమేష్, బాలాజీ, రవీంద్ర, ఏఎన్ఎంలు అక్కమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.2.41 కోట్లు


హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ నిర్వహించారు. ఈ లెక్కింపులో స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గడచిన 28 రోజులకు గాను నగదు రూపేణా శ్రీవారికి రూ.2,41,72,018 ఆదాయంతో పాటు, కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 401 గ్రాముల బంగారం, 6.222 కేజీల వెండి, పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ అధికంగా లభించినట్టు ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దైన పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ. 1,71,000 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోబూచులాడుతున్న గోదావరి


కుక్కునూరు గ్రామ శివారులో గోదావరి వరద

కుక్కునూరు: విలీన మండలాల్లో గోదావరి వరద పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడుతుంది. బుధవారం ఉదయం 51 అడుగులు ఉన్న గోదావరి సాయంత్రానికి భద్రాచలం వద్ద 45 అడుగులకు తగ్గింది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గురువారం సాయంత్రానికి మరలా వరద ప్రవాహం మూడు అడుగులు పెరిగి 48 అడుగులకు చేరడంతో రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వరద నీరు ఇప్పుడు చేరుతుండడంతోనే మరలా వరద ప్రవాహం పెరిగినట్టు సమాచారం. కాగా మరో రెండు అడుగులు పెరిగి తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం రెండో ప్రమాద హెచ్చరికకు చేరడంతో కలెక్టర్ వెట్రిసెల్వీ మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. నదీ ప్రవాహం పెరుగుతున్నందున గ్రామస్తులు నది సమీపంలోకి వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కామవరపుకోట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయటం ప్రమాదకరమని తడికలపూడి ఎస్సై జయబాబు అన్నారు. గురువారం స్థానిక సొసైటీ పెట్రోల్ బంకు ఎదురుగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాల ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడంతోనే సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. అలా ఇస్తే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే, శిక్ష వాహన యజమానికి పడుతుందని, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.

దోమల నివారణకు చర్యలు


ద్వారకాతిరుమలలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: దోమల నివారణకు స్థానిక పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం రాత్రి ద్వారకాతిరుమలలోని ప్రధాన రహదారుల గుండా, అలాగే వీధుల్లో ఫాగింగ్ చేశారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. నివాసాల వద్ద నీటి తొట్టెలు, కుంటలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, లేకుంటే లార్వా పెరిగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటం స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, తదితరులున్నారు.

డీవైఎఫ్ఐ తరగతులు జయప్రదం చేయండి


డీవైఎఫ్ఐ సమావేశంలో పాల్గొన్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ప్రజా సంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు ఎం.వెంకట్రాజు అధ్యక్షత వహించగా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ మాట్లాడారు. నిరంతరం నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పని చేస్తున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర తరగతులు ఈ నెల 27, 28, 29, 30 తేదీలలో నంద్యాల జిల్లాలో నిర్వహిస్తారన్నారు. తరగతులకు డీవైఎఫ్ఐ సంఘం ముఖ్య నాయకులు హాజరవుతారని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల భవిష్యత్ కార్యాచరణకు అజెండాగా ఈ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ తరగతులకు ఏలూరు జిల్లా నుంచి 14 మంది హాజరవుతున్నారని ఏలూరు జిల్లా ప్రధాన సమస్యలను కూడా ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రాజేష్, నాని, యు.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు రహదారులు ఛిద్రం


కోతకు గురైన రహదారి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామాలైన రేగులపాడు, రేపల్లె, డోలుగండి సమీపంలో సుద్దగండి వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు ఛిద్రంగా తయారయ్యాయి. కోతకు గురయ్యాయి. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి తమకు రహదారి ఇబ్బందులు లేకుండా చూడాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు. అదే విధంగా పూచికగొంది, చింతకొండ, పలు గ్రామాల్లో రహదారులు వరద తాకిడికి కోతకు గురయ్యాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు.

నిత్యావసరాల పంపిణీ

వేలేరుపాడు: పెద్దవాగు ప్రభావం వల్ల సర్వం కోల్పోయిన అల్లూరినగర్ గ్రామ గిరిజనులకు గతంలో వేలేరుపాడు మండలంలో పనిచేసిన విద్యాశాఖాధికారి జగన్మోహన్‌రావు గురువారం నిత్యావసరవస్తువులు పంపిణీ చేశారు. గ్రామంలో 83 కుటుంబాలకు ఐదు రకాల నిత్యావసర వస్తువులు, కొవ్వొత్తులు, దుస్తులు పంపిణీ చేశారు. మేడేపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ బీజేపీ పట్టణ సమావేశంలో తీర్మానం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం ఈ సమావేశం జరగగా, సభ్యులు పాల్గొన్నారు. రైతు బజారు ఏర్పాటు చేయాలని, బైనేరు బ్రిడ్జిని నిర్మించాలని, డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని, జేపీ సెంటర్ నుంచి శ్రీనివాసపురం వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల ఆక్రమణలు సరి చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు.

బడ్జెట్లో వ్యవసాయ కార్మికుల ఊసేదీ?

జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు


మాట్లాడుతున్న కుంచె వసంతరావు

జంగారెడ్డిగూడెం: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని, ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, ఆరుకాలం శ్రమించే కష్టజీవులైన వ్యవసాయ కార్మికుల ఊసే లేదని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు విమర్శించారు. గురువారం జంగారెడ్డిగూడెం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు కనీస వేతన బిల్లుపై గాని, ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నిధులు మంజూరుపై కాని బడ్జెట్లో లేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి కేంద్రం తన వంతు కృషి చేసిందన్నారు. రాజధానికి రూ.15 వేల కోట్లను నేరుగా గ్రాంటుగా ప్రకటించకుండా, ప్రపంచ బ్యాంకు వంటి వాటి నుంచి అప్పుగా ఇస్తామని, దానికి తాము హామీ ఇస్తామని చెబితే రాష్ట్ర ప్రభుత్వం మనకేదో మేలు జరిగినట్లు గొప్పలు చెప్పుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడగలేని స్థితి, కేంద్ర వైఖరి రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. విలీన మండలాల్లో వరదలు భీభత్సం సృష్టించి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బ తీశాయని, ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి మండలం యూనిట్‌గా భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, శ్రీను, నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం: బ్రేకటింగ్, విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈ నెల 26న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. కొయ్యలగూడెం, గవరవరం, చొప్పరామన్నగూడెం, అంకాలగూడెం, రేపల్లెవాడ, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

టి.నరసాపురం: విద్యుత్ మరమ్మతులు, చెట్ల నరికివేత నేపథ్యంలో ఈ నెల 26న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. 33/11 కేవీ వెలగపాడు విద్యుత్ ఉప కేంద్రంలోని వెలగపాడు, వీరభద్రవరం గ్రామాలు, 33/11 కేవీ జలపవారిగూడెం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో జలపవారిగూడెం, అంకాలంపాడులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎరక్రాలువలోకి గంటకు 1733 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

జంగారెడ్డిగూడెం రూరల్: కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్ర కాలువ జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం గంటకు 1733 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, డ్యాం గేట్ల ద్వారా గంటకు 1733 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటి మట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.10 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు.

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు


ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్‌లో విద్యార్థులతో ఎంఈవో

లింగపాలెం: శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే మండలంలోని ప్రతీ పాఠశాలలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మాజీగూడెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలను మండల విద్యాశాఖ అధికారి కంట రామారావు తిలకించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపులోనే వరి నారుమడులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ముంపులోనే వరినారుమడులు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొండవాగుల నీటితో పాటు వరద ఎగపోటు నీరు కూడా కలవడంతో గత ఐదురోజులుగా నారుమడులు వరదనీటిలోనే ఉన్నాయి. నారుమడులు కుళ్లిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పంట పొలాలు ఎప్పటికి బయట పడతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నీరు తగ్గాక నాట్లు వేసుకునేందుకు వరినారు దొరుకుతుందో లేదోనని ఆయోమయంలో రైతులు ఉన్నారు.

కళాశాల వద్ద ప్రత్యేక నిఘా

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ వద్ద నిరంతరం ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై కె.వెంకన్న తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిఘా ఏర్పాటు చేశామన్నారు. కొంతమంది ఆకతాయిలు ఆడపిల్లలను ఈవ్‌టీజింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఉదయం, సాయంత్రం అక్కడ పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే కొంతమందికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే విద్యార్థులు మాదక ద్రవ్యాలతో కలిగే ఇబ్బందులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

గురువులుగా పట్టాభిషేకం

ఏలూరు (ఆర్ఆర్ పేట): ఏలూరు కథోలిక పీఠం పరిధిలో గురువులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఫాదర్లకు గురువులుగా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. బిషప్ పొలిమేర జయరావు గురు పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని ఏలూరు బిషప్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు.